

ముమ్మరంగా వాహనాల తనిఖీ

శంషాబాద్, జూన్ 3 : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని పలు ప్రాంతాల్లో శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులు సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనుండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నివారించేందుకు వాహనాలు తనిఖీ చేపట్టినట్టు సీఐ బాల్ రాజ్ తెలిపారు. శంషాబాద్‌లోని పలు బస్తీలతో పాటు ఎయిర్‌పోర్టుకు వచ్చీపోయే దారుల్లో వాహనాల తనిఖీలు చేపట్టారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

- లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ఠమైన మూడంచెల భద్రత
- నేడు ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- బీఎస్ఐటీలో చేవెళ్ల పార్లమెంట్ ఓట్ల లెక్కింపు
- మూడుచోట్ల లెక్కించనున్న మల్కాజిగిరి పార్లమెంట్ ఓట్లు
- మొదటగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు
- చేవెళ్ల పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు 165 టేబుళ్లు, 150 రౌండ్లు
- మల్కాజిగిరిలో 158 టేబుళ్లు.. 141 రౌండ్లు
- రాజకీయ ఏజెంట్ల సమక్షంలో తెరవనున్న స్ట్రాంగ్‌రూమ్స్

రంగారెడ్డి అర్బన్/మేడ్చల్ (ఆంధ్రజ్యోతి). జూన్ 3 : నేడు జరగనున్న లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గ ఓట్లను చేవెళ్ల మండలం గొల్లపల్లిలోని బీఎస్ ఐటీ కాలేజీలో ఓట్లు లెక్కించనున్నారు. మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో ఓట్ల లెక్కింపును మూడు కేంద్రాల్లో చేపట్టనున్నారు. మేడ్చల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఓట్ల లెక్కింపును కీసరలోని హోళీమేరీ ఇంజనీరింగ్ కాలేజీలో, ఎల్బీనగర్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపును సరూర్‌నగర్ స్టేడియంల కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓట్లను వెస్లీ కాలేజీలో చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



చేవెళ్ల మండలం గొల్లపల్లిలోని బీఎస్ఐటీ కాలేజీలో చేసిన ఏర్పాట్లు

పాస్‌లు ఉంటేనే అనుమతి...

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపుకు సంబంధించిన కౌంటింగ్ పాస్‌లు ఉంటేనే లోపాలకి అనుమతి ఉంటుందని చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు. పాస్‌లు లేనివారిని ఎట్టిపరిస్థితిలో లోపలికి అనుమతించబడదని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా బండారు శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో వాహనాల కోసం ఆరు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. ఇందులో వీపీఐలు, పార్టీనాయకులు, అధికారులు, మీడియాకు తదితర పార్కింగ్ స్థలాలు వేర్వేరుగా ఏర్పాటు చేశారు



చేవెళ్ల మండలం గొల్లపల్లిలోని బీఎస్ఐటీ కాలేజీలో ఏర్పాటు చేసిన మీడియా పాయింట్



కీసరలోని హోళీమేరీ కళాశాలలో మల్కాజిగిరి ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు చేసిన టేబుళ్లు

చేవెళ్ల లెక్కింపు ఇక్కడే..

మహేశ్వరం నియోజకవర్గం ఓట్ల లెక్కింపును గొల్లపల్లిలోని బీఎస్ఐటీ కాలేజీ బ్లాక్ బి'లోని 1వ అంతస్తులో, రాజేంద్రనగర్ నియోజకవర్గం బ్లాక్ ఎ'లోని 2వ అంతస్తులో, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఓట్ల లెక్కింపు బ్లాక్ బి లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో, చేవెళ్ల నియోజకవర్గం ఓట్ల లెక్కింపు బ్లాక్ ఎ'లోని 1వ అంతస్తులో, పరిగి నియోజకవర్గం ఓట్ల లెక్కింపు బ్లాక్ బి'లోని 2వ అంతస్తులో, వికారాబాద్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు బ్లాక్ బి'లోని 2వ అంతస్తులో, తాండూరు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు బ్లాక్ బి'లోని 3వ అంతస్తులో కొనసాగనుంది. అదే విధంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు బ్లాక్ ఎ'లోని 1వ అంతస్తులో జరగనుంది. ఓట్ల లెక్కింపుకు సంబంధించి 777 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. వారి కోసం రాజేంద్రనగర్ నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించారు. ఇప్పటికే వీరందరికి శిక్షణ పూర్తి చేశారు. వీరంతా నేటి ఉదయం ఆరు గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకుంటారు. అబ్జర్వర్ సమక్షంలో ఐదు వీవీ ప్యాట్స్ ర్యాండమ్‌గా ఎంపిక చేసి స్లిప్పులను లెక్కించనున్నారు. ప్రతీ రౌండ్ పూర్తవగానే ఎంకోర్ యాప్‌లో డేటా నమోదు చేయనున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద అఫీషియల్ కమ్యూనికేషన్ రూమ్, మీడియా సెంటర్, పబ్లిక్ కమ్యూనికేషన్ రూమ్ ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగ్ కేంద్రాలలోకి ఎలాంటి వస్తువులు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు వచ్చి సరిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగ్ సిబ్బందికి అల్పాహారం, భోజనాల కోసం కూడా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో ఓట్ల లెక్కింపునకు 1,150 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని రకాల వసతులు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉదయం 8 గంటలకు లెక్కింపు షురూ..

నేడు ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కించనున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన మూడంచేల భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సిబ్బందిని నేటి ఉదయం 5.30 గంటల్లోగా అబ్జర్వర్ సమక్షంలో ర్యాండమైజేషన్ చేసి టేబుల్ వారీగా కేటాయించనున్నారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్‌ను నియించారు. రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో ఉదయం స్ట్రాంగ్ రూములను తెరవనున్నారు.



హోళీమేరీ కళాశాలలో ఏర్పాట్లు

చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గం

కౌంటింగ్ సిబ్బంది వివరాలు
కౌంటింగ్ సూపర్‌వైజర్లు :227
కౌంటింగ్ అసిస్టెంట్స్ :273
మైక్రో అబ్జర్వర్లు :277
మొత్తం కౌంటింగ్ సిబ్బంది :777
పోలింగ్ స్టేషన్లు :2,877

మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గం

కౌంటింగ్ సిబ్బంది వివరాలు
కౌంటింగ్ సూపర్‌వైజర్లు :178
కౌంటింగ్ అసిస్టెంట్స్ :205
మైక్రో అబ్జర్వర్లు :192
మొత్తం కౌంటింగ్ సిబ్బంది :575

ఓట్ల వివరాలు (చేవెళ్ల)

	మొత్తం ఓట్లు	పోలైనవి
పురుషులు	15,04,260	8,53,237
మహిళలు	14,33,830	8,03,827
ఇతరులు	280	43
మొత్తం ఓట్లు	29,38,370	16,57,107
పోలింగ్ శాతం	:56.40	

టేబుళ్ల వారీగా ఓట్ల లెక్కింపు ఇలా

నియోజకవర్గం	పోలైన ఓట్లు	టేబుళ్లు	రౌండ్లు
మహేశ్వరం	2,93,472	28	20
రాజేంద్రనగర్	3,31,318	28	20
శేరిలింగంపల్లి	3,32,853	28	23
చేవెళ్ల	1,93,911	14	22
పరిగి	1,78,637	14	22
వికారాబాద్	1,63,167	14	21
తాండూరు	1,63,743	14	20
పోస్టల్ ఓటు	19,290(పీబీఎస్)	24+1	02

ఓట్ల వివరాలు (మల్కాజిగిరి)

	మొత్తం ఓట్లు	పోలైనవి
పురుషులు	19,45,624	9,95,791
మహిళలు	18,33,430	9,23,206
ఇతరులు	542	134
మొత్తం ఓట్లు	37,79,596	19,19,131
పోలింగ్ శాతం	50.78	

టేబుళ్ల వారీగా ఓట్ల లెక్కింపు ఇలా

నియోజకవర్గం	పోలైన ఓట్లు	టేబుళ్లు	రౌండ్లు
మేడ్చల్	3,96,970	28	21
మల్కాజిగిరి	2,64,189	20	21
కుత్బుల్లాపూర్	3,99,752	28	21
ఉప్పల్	2,72,870	20	20
కూకట్‌పల్లి	2,49,894	20	21
కంటోన్మెంట్	1,24,517	14	17
ఎల్బీనగర్	2,95,131	28	20
పోస్టల్ ఓట్లు		20	02

చేవెళ్ల, : కౌంటింగ్ కేంద్రాన్ని సోమవారం ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియా, కౌంటింగ్ పరిశీలకులు మృణాళిని సావంత్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డిలతో కలిసి రిటర్నింగ్ అధికారి శశాంక పరిశీలించారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపుకు చేవెళ్ల మండలం గొల్లపల్లి పరిధిలో ఉన్న బండారు శ్రీనివాస్ ఇంజనీరింగ్ ఉండాలన్నారు. ప్రతీ కౌంటింగ్ టేబుల్ వద్ద నియోజకవర్గ వివరాలను తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని, ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును చేపట్టి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎటువంటి పొరపాట్లకు జరగకుండా

ఏర్పాట్లను పరిశీలించిన ఎన్నికల అధికారులు



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

కళాశాల ఆవరణలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏర్పాట్లను అధికారులు సోమవారం పరిశీలించారు. అలాగే ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను నిబంధనల మేరకు అబ్జర్వర్ల సమక్షంలో పూర్తిచేశారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ఈ ప్రక్రియను స్ర్కీన్‌పై చూపించారు. మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నేడు ఉదయం 5గంటలకు నిర్వహిస్తారు. ఇదిలా ఉంటే కలెక్టర్, ఇతర అధికారులు సోమవారం ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్‌ను సందర్శించారు. ఆయా కౌంటింగ్ హాళ్లలో టేబుళ్లు, బారికేడ్లు, సీసీ కెమెరాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా పర్యవేక్షణ జరపాలని రిటర్నింగ్ అధికారి సహాయ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. నిర్దీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా సన్నద్ధమై నిబంధనలను పాటించాలని, పోస్టల్ బ్యాలెట్ ఓటు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను అభ్యర్థులు, వారి ఏజెంట్లకు స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈవీఎంల ఓట్లను ఒక్కో రౌండ్ వారీగా జాగ్రత్తగా లెక్కిస్తూ, ప్రతి రౌండ్‌కు ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలని అన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు వచ్చి సరిచేస్తారని, కౌంటింగ్ ప్రక్రియను యథాతథంగా కొనసాగించాలని తెలిపారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందితో పాటు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో వివిధ కార్యకలాపాల నిర్వహణ కోసం నియమించబడిన వారికి పాసులు అందించాలని, పాసు కలిగి ఉన్న వారినే కౌంటింగ్ సెంటర్ లోనికి అనుమతించాలని సూచించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ పరిశీలనలో రిటర్నింగ్ అధికారి వెంట అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, చేవెళ్ల డీసీపీ శ్రీనివాస్, అసెంబ్లీ నియోజకవర్గాల సహాయ రిటర్నింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గంటకు నాలుగు రౌండ్లు...

ఒక్కో రౌండుకు 10 నుండి 15 నిమిషాల సమయం పడుతుంది. గంటకు నాలుగు రౌండ్లు పూర్తవుతాయి. ఏడు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పూర్తయ్యాకే రౌండ్ల వారీగా ఓట్లను క్రోడీకరించి ఫలితం ప్రకటిస్తారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభిస్తారు. మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో అత్యధికంగా 21 రౌండ్ల లెక్కింపు జరుగనుండటంతో 5 గంటలకు పైగా సమయం తీసుకోనుంది. ఆ తర్వాతే తుది ఫలితం వెలువడనుంది.

భారీ బందోబస్తు....

ఓట్ల లెక్కింపు సందర్భంగా రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 650 మంది పోలీస్‌లతో కూడిన మూడంచెల పోలీస్ భద్రత కట్టుదిట్టంగా ఏర్పాటు చేశారు. ఇందులో ఒక డీసీపీ, ఒక అడిషినల్ డీసీపీ, 7 ఏసీపీలు, 16 మంది సీఐలు, 41 మంది ఎస్సైలు, 80 మంది ఏఎస్సైలు, 40 మంది మహిళా కానిస్టేబుల్స్, మరో 250 మంది పోలీస్ కానిస్టేబుల్స్‌లు, వీరితోపాటు 150 మంది రిజర్వు పోలీస్ ఉంటారని చేవెళ్ల ఏసీపీ బంటు కిషన్ స్పష్టం చేశారు. మూండెచల పోలీస్ బందోబస్తుకొనసాగుతుందన్నారు.

వాహనాల దారిమళ్లింపు....

పార్లమెంట్ ఓట్ల లెక్కింపు సందర్భంగా చేవెళ్ల మండలం నుంచి శంకర్‌పల్లి వెళ్లే వాహనాలను దారి మళ్లించనున్నారు. చేవెళ్ల మండల కేంద్రం నుంచి ఊరెళ్ల గ్రామం మీదుగా ఎన్కెపల్లి చౌరస్తా వరకు వాహనాలు వెళ్లే విధంగా పోలీస్ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రం బండారు శ్రీనివాస్ కళాశాల వరకు ఇతర భారీ వాహనాలు తప్ప, ఇతర వాహనాలకు అనుమతి లేదని పోలీస్‌లు స్పష్టం చేశారు.



కౌంటింగ్ సిబ్బందికి భోజన ఏర్పాట్లు

భవితవ్యం తేలేది నేడే


- చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- అభ్యర్థులందరికీ అగ్ని పరీక్షే
- పైకి ధీమా.. లోపల టెన్షన్..!
- గెలిచిన వారికి కేంద్ర మంత్రివర్గంలో ఛాన్స్!
- సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న సర్వేలు
- సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్‌గా మారిన ఎన్నికలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

బరిలో ఉన్న అభ్యర్థులు

నియోజకవర్గం	అభ్యర్థులు
చేవెళ్ల	43
మల్కాజిగిరి	22

సర్వత్రా ఉత్కంఠరేకెత్తించిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు మరి కొద్ది గంటల్లో వెలువడనున్నాయి. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల పరిధిలోని చేవెళ్ల, మల్కాజిగిరి, భువనగిరి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాలకు సంబంధించి నేడు ఓట్ల లెక్కింపు జరగనుంది. చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాలు పూర్తిగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే ఉన్నాయి. అయితే ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గం భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఉండగా.. షాద్‌నగర్, కల్వకుర్తి, కొడంగల్ అసెంబ్లీ స్థానాలు మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్నాయి. ఈ నాలుగు పార్లమెంట్ స్థానాల పరిధిలో జరిగిన ఎన్నికలు సర్వత్రా ఉత్కంఠ రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా చేవెళ్ల, మల్కాజిగిరి, మహబూబ్‌నగర్ బరిలో మహామహులు బరిలో దిగారు. ఈ ఎన్నికలు చావో రేవో అన్నట్లుగా అభ్యర్థులు పోరాడారు. దీంతో ఎన్నికల్లో అభ్యర్థులు భారీగా డబ్బు కూడా ఖర్చు పెట్టారు. దాదాపు అభ్యర్థులందరి రాజకీయ భవిష్యత్తు ఈ ఫలితాలతో ముడిపడి ఉంది. అలాగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూడా ఈ ఎన్నికల ఫలితాలు సవాల్‌గా మారాయి. ఈ అయిదు స్థానాల అభ్యర్థుల ఎంపిక, గెలుపు బాధ్యతలు పూర్తిగా రేవంత్‌రెడ్డి తీసుకున్నారు. ముఖ్యంగా మల్కాజిగిరి నియోజకవర్గం ఆయన సిట్టింగ్ స్థానం కావడంతో దీన్ని నిలబెట్టుకోవడం సవాల్‌గా మారింది. అలాగే ఆయన కొన్నాళ్ల పాటు ఇన్‌చార్జ్‌గా ఉన్న చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికలను కూడా ఆయన సవాల్‌గా తీసుకున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ అసెంబ్లీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఉండడంతో ఇక్కడ గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారు. ఈ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమి చెందితే సీఎం రేవంత్‌రెడ్డికి కొంత ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే దేశంలోనే అత్యధిక ఓటర్లు ఉన్న మల్కాజిగిరి, చేవెళ్లలో హోరాహోరీగా పోటీ జరిగింది. చేవెళ్ల లోక్‌సభ స్థానంలో పాగా వేసేందుకు ప్రధాన పార్టీలు అపర కుబేరులను రంగంలో దింపాయి. ప్రముఖ పౌల్ట్రీ వ్యాపారవేత్త, సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తుండగా బీఆర్ఎస్ నుంచి జడ్పీ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్, బీజేపీ నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి బరిలో నిలిచారు. ఇంకా మరికొందరు పోటీ చేస్తున్నప్పటికీ ప్రధాన పోటీ ఈ ముగ్గురు మధ్యే నెలకొంది. ప్రధాన పార్టీల నుంచి బరిలో ఉన్న అభ్యర్థులు శ్రీమంతులు కావడంతో ఆయా రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా డబ్బును వెదజల్లాయి. ఈ మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఈ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా దాదాపు రూ. 300కోట్లకు పైగానే ఖర్చుచేస్తున్నట్లు అంచనా. ఈ ముగ్గురు అభ్యర్థులకు ఈ ఎన్నికలు అగ్నిపరీక్షగా మారాయి. ఓటమి చెందిన వారికి ఇక రాజకీయ భవిష్యత్తు కష్టమేనని చెప్పాలి. ఇప్పటికే ఈ ముగ్గురు అభ్యర్థులు పార్టీలు మారారు. అలాగే మల్కాజిగిరి స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతా రెడ్డి పోటీ చేస్తుండగా బీజేపీ నుంచి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి బరిలో ఉన్నారు. ఇక్కడ సునీతారెడ్డి, ఈటల రాజేందర్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. వీరిద్దరికీ ఈ ఎన్నికలు సవాలేనని చెప్పాలి. అలాగే మహబూబ్‌నగర్ నుంచి కాంగ్రెస్ తరఫున చల్లా వంశీచంద్ రెడ్డి, బీజేపీ తరుపున మాజీమంత్రి డీకే అరుణ బరిలో ఉన్నారు.



పైకి ధీమా.. లోపల టెన్షన్..!

ప్రధాన పార్టీ అభ్యర్థులంతా గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ పోలింగ్ సరళి చూసి లోలోపల ఆందోళన చెందుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ శాతం గణనీయంగా తగ్గింది. బీజేపీ అనూహ్యంగా పుంజుకోవడంతో ఇతర పార్టీల అంచనాలన్నీ తారుమారయ్యాయి. అయితే గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే కొన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ పెరిగింది. కొన్నిచోట్ల పెరిగిన ఓటింగ్, మరికొన్ని చోట్ల తగ్గిన ఓటింగ్ ప్రభావం తమపై ఏ మేర ప్రభావం చూపుతుందోనని లెక్కలు వేసుకుంటున్నారు.

గెలిస్తే కేంద్ర మంత్రివర్గంలోకి...

ఈ ఎన్నికల్లో గెలిచే బీజేపీ అభ్యర్థులకు భవిష్యత్తు ఆశాజనకంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎగ్జిట్ పోల్ సర్వేలు ఇప్పటికే ఎన్డీఏ మళ్లీ కేంద్రంలో అధికారంలోకి వస్తుందని స్పష్టం చేయడంతో బీజేపీ అభ్యర్థుల్లో ఆశలు చెలరేగుతున్నాయి. బీజేపీ మళ్లీ కేంద్రంలో పగ్గాలు చేపడితే మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్, చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ అభ్యర్థి డీకే అరుణలలో ఎవరికైనా కేంద్ర మంత్రివర్గంలో ఛాన్స్ లభించే అవకాశాలు ఉన్నాయి.

పురాతన రామచంద్రస్వామి రాతివిగ్రహం లభ్యం

- ఉపాధి పనులు చేస్తుండగా బయల్పడిన విగ్రహం
- యాచారం మండల పరిధిలో ఘటన



యాచారం, జూన్ 3 : ఉపాధి పనులు చేస్తుండగా పురాతన శ్రీరామచంద్ర స్వామి రాతి విగ్రహం బయల్పడింది. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నల్లవెల్లి-తమ్మలోని గూడ గ్రామాల మధ్య సోమవారం తమ్మలోనిగూడ గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు రోడ్డు పనులు చేస్తుండగా శ్రీరామచంద్ర స్వామి విగ్రహం లభ్యమైంది. కూలీలు భట్టు కృష్ణయ్య అనే రైతు పొలంలో మట్టి తవ్వుతుండగా బండ రాయి గడ్డపారకు తగలడంతో కూలీలు ముందుగా పెద్ద బండరాయి ఉందని అనుకున్నారు. దాంతో ముగ్గురు కూలీలు అతి కష్టం మీద బండరాయి బయటకు తీశారు. అయితే, ఆ రాయి చెక్కబడి ఉండడం గమనించి విగ్రహమని తెలుసుకున్నారు. వెంటనే నీటితో శుభ్రం చేయగా శ్రీరామచంద్ర స్వామి వారి విగ్రహంగా గుర్తించారు. దాంతో కూలీలంతా టెంకాయలు తీసుకొచ్చి స్వామివారి విగ్రహం ఎదుట కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఈ విషయం ఎంపీడీవో నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కాగా, లభ్యమైన విగ్రహం రాతియుగం నాటిదని పలువురు కూలీలు పేర్కొన్నారు.

పురావస్తు శాఖ అధికారులతో పరీక్ష చేయిస్తాం

కాగా, కూలీలకు లభ్యమైన విగ్రహాన్ని పురావస్తు శాఖ అధికారులతో పరీక్ష చేయించనున్నట్లు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు వెల్లడించారు. విగ్రహం లభ్యమైందనే విషయం తెలుసుకున్న ఆయన యాచారం పోలీస్ స్టేషన్‌కు చేరుకొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. విగ్రహాన్ని వెంటనే స్టేషన్‌కు తరలించాలని, మంగళవారం పురావస్తు శాఖ అధికారుల చేత పరీక్ష చేయిస్తే వాస్తవాలు తెలుస్తాయని ఏసీపీ చెప్పారు.

టాటాసుమో, బైక్ ఢీ.. ఇరువురికి గాయాలు

పూడూరు, జూన్ 3 : టాటాసుమోకు ద్విచక్రవాహనం తగిలి ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం పూడూరు మండల పరిధిలో చోటుచేసుకుంది. వికారాబాద్ వైపు నుంచి టాటాసుమో(ఏపీ-9-పీబీ652) మన్నెగూడవైపు వెళ్తోంది. ఈ క్రమంలో ఎన్కెపల్లి మోడల్‌స్కూల్ వద్దకు రాగానే టైరు పగిలి టాటాసుమో అదుపుతప్పింది. అదే సమయంలో వికారాబాద్ వైపు వెళుతున్న ద్విచక్రవాహనం (నెం.టీఎస్34జే0842) టాటాసుమోకు తగిలింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న మహ్మద్ మౌలానా, భార్య రేష్మాబేగానికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు.

నకిలీ విత్తనాలతో మోసం చేశారంటూ రైతుల ఆందోళన

కొడంగల్, జూన్ 3: కొడంగల్ పట్టణంలోని ఓ ఫర్టిలైజర్స్ దుకాణదారుడు తమకు నకిలీ విత్తనాలు విక్రయించి మోసం చేశారని రైతులు ఆందోళన చేశారు. సోమవారం కొడంగల్‌లో దుకాణం ముందు రోడ్డుపై పలువురు రైతులు బైఠాయించారు. ఇటీవలే తమకు నకిలీ వరి విత్తనాలను అంటగట్టడంతో తీవ్రంగా నష్టపోయామని వాపోయారు. తమకు పరిహారం ఇప్పించాలని రాస్తారోకో చేశారు.


రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు


తాండూరులో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ రుద్రమూర్తి

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

బొంరాస్‌పేట్, : ఫర్టిలైజర్స్ దుకాణాల్లో నకిలీ, గడువు ముగిసిన విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో అనురాధ, ఎస్సై అబ్దుల్ రవూఫ్ అన్నారు. సోమవారం బొంరాస్‌పేట్‌లోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను వారు తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని సూచించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన తర్వాత బిల్లులు తప్పనిసరిగా అందించాలన్నారు.

పత్తి విత్తనాల కొరత లేదు

తాండూరురూరల్: తాండూరు ప్రాంతంలో పత్తివిత్తనాల కొరత లేదని వ్యవసాయ శాఖ తాండూరుడివిజన్ ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. సోమవారం పట్టణంలోని రాజ్‌సేల్స్, రవిరాజ్, నందిని, కావేరి, హన్‌మాన్, మనగ్రోమోర్, న్యూసందీప్, అన్నదాత ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.

పాంబండ దేవాలయాన్ని దర్శించుకున్న న్యాయాధికారి

కులకచర్ల, జూన్ 3: కులకచర్ల మండలంలోని పాంబండ దేవాలయాన్ని సోమవారం పరిగి సివిల్ కోర్టు న్యాయాధికారి శిల్ప కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.అర్చకులు పాండుశర్మ వారికి స్వాగతం పలికి స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అన్వేష్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శంకరయ్య పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న న్యాయాధికారి శిల్ప


విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న ఎన్కేపల్లి గ్రామస్తులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

సబ్‌స్టేషన్ వద్ద ఎన్కేపల్లి గ్రామస్తుల ఆందోళన

చేవెళ్ల, జూన్ 3 : విద్యుత్ సరఫరాలో అంతరాయంపై గ్రామస్తులు నిరసనకు దిగారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని నిరసిస్తూ సోమవారం ఉదయం చేవెళ్ల మండల పరిధిలోని ఈర్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎన్కేపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చినుకుపడితే చాలు కరెంట్ పోతుందని వాపోయారు. గట్టిగా గాలి వీచినా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్ అధికారులకు, సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదన్నారు. అధికారులు స్పందించకపోవడంతోనే విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేయడానికి సిద్ధమైనట్లు చెప్పారు. అయితే, ఏరియా లైన్‌మ్యాన్ భిక్షపతి గ్రామస్తులు, రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న చేవెళ్ల మండల విద్యుత్ ఏఈ జానీ మొయినుద్దీన్ స్పందించి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడారు. మరోమారు ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా చూస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. దాంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

సాగు షురూ!



అడపా దడపా వర్షాలు పడుతుండడంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. యాచారం మండలంలోని పలు గ్రామాల్లో వర్షం పడడంతో విత్తనాలు వేస్తున్నారు. ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్న రైతులు ప్రస్తుతం కురిసిన వర్షాలకు కంది, జొన్న విత్తనాలు వేస్తున్నారు. ధర్మన్నగూడలో జొన్న విత్తనాలు వేసిన రైతు నర్సింహ మాట్లాడుతూ ఈ కార్తెలో విత్తనాలు వేస్తే దిగుబడి బాగా వస్తుందని తెలిపారు. మరోమారు వర్షం కురిస్తే పత్తి విత్తనాలు వేయడం కూడా ప్రారంభం కానుంది.

- యాచారం, జూన్ 3

స్కేటింగ్‌లో గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు
సాధించిన ఆత్కూర్ కుర్రోడు



పెద్దేముల్, జూన్ 03 : ఆత్కూర్ గ్రామానికి చెందిన బాలుడు స్కేటింగ్‌లో గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించాడు. పెద్దేముల్ మండలం ఆత్కూర్ గ్రామానికి చెందిన విక్రమాచారి కుమారుడు రుద్రాంశ్‌చారి నెల్లూరు జిల్లాలో మూడవతరగతి చదువుతున్నాడు. తండ్రి ఉద్యోగరీత్యా నెల్లూరు జిల్లాలో పనిచేస్తుండడంతో ఆయన కుమారుడిని అక్కడే ముత్తుకూరు మండల కేంద్రంలో చదివిస్తున్నారు. శివగంగ రోలర్‌స్కేటింగ్ క్లబ్ వారు కర్ణాటకలోని బెల్గాంలో మే 26 నుంచి 31 వరకు అటెంప్ట్ ఫర్ గిన్నిస్‌వరల్డ్ రికార్డు పేరున 75 గంటల స్కేటింగ్ నిర్వహించారు. అందులో రుద్రాంశ్‌చారి పాల్గొని పతకం సాధించాడు. గిన్నిస్ రికార్డ్‌లో స్థానం సంపాదించాడు. విషయం తెలిసిన గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆబాలుడికి అభినందనలు తెలియజేశారు.


స్కేటింగ్‌లో తనతోపాటు గిన్నిస్‌రికార్డ్ సాధించిన విద్యార్థులతో..

అభివృద్ధి, సంక్షేమంలో
అగ్రస్థానానికి తెలంగాణ

మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి

బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో

ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

రంగారెడ్డి అర్బన్, జూన్ 3 : దశాబ్దిలోనే... శతాబ్దకాల అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని హుడా కాలనీలోని జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణను అభివృద్ధి, సంక్షేమంలో అనతి కాలంలోనే అగ్రస్థానానికి చేర్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్‌కే దక్కిందన్నారు. దశాబ్దిలోనే శతాబ్దకాల అభివృద్ధిని చేసుకొని, అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణను దేశానికి రోల్ మోడల్‌గా కేసీఆర్ నిలిపారని కొనియాడారు. తొమ్మిదేళ్ల కాలంలో.. వ్యవసాయాన్ని పండుగ చేసిందని, విద్యుత్ రంగాన్ని పటిష్ఠం చేశారని, విద్యారంగాన్ని ఆదర్శంగా నిలిచిందని, వైద్యరంగాన్ని అగ్రస్థానానికి చేర్చిందన్నారు. పెట్టుబడులతో ప్రపంచ దృష్టిని ఆకర్షించినట్లు తెలిపారు. కరువుల బాధలు లేకుండా చేశారని, వలసలు వాపస్ తెచ్చిందని, పంట పొలాలను సస్యశ్యామలం అయ్యాయని, ఆర్థిక క్రమశిక్షణతో అభివృద్ధి చేసి శభాష్ తెలంగాణ అని దేశం మెచ్చుకునేలా చేసింది కేసీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో శాసనసభ్యులు ప్రకాష్‌గౌడ్, చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య, మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు ఉద్యమకారులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


రంగారెడ్డి అర్బన్ : ఆవిర్భావ వేడుకల్లో మాజీ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేలు


ఆమనగల్లు : ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు

బాధిత కుటుంబ సభ్యులకు సబితారెడ్డి పరామర్శ

కందుకూరు : మండల పరిధిలోని లేమూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎలుక శ్రీధర్‌రెడ్డి, పోలోజీ లక్ష్మయ్యలు వేర్వేరు కారణాలతో మరణించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సోమవారం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, పరామర్శించారు. మృతిచెందిన నాయకుల మృతదేహాలపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. పార్టీ తరఫున వారి కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని సబితారెడ్డి భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పరంజ్యోతి, నాయకులు ఢిల్లీ గణేశ్, లక్ష్మీనర్సింహారెడ్డి, సంజీవరెడ్డి, సుకుమార్, జైపాల్, మల్లేష్, మాజీ ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దశాబ్ది ఉత్సవాలకు తరలిన నాయకులు

ఆమనగల్లు : జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు ఆమనగల్లు, కడ్తాల మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్‌తో కలిసి జెండా విష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర కలను సాకారం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు అనురాధ పత్యానాయక్, జర్పుల దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, కౌన్సిలర్ రాధమ్మవెంకటయ్య, బీఆర్ఎస్ అధ్యక్షులు పోనుగోటి అర్జున్‌రావు, నేనావత్ పత్యనాయక్, శంకర్, ఎంపీటీసీలు దోనాదుల కుమార్, లచ్చిరామ్‌నాయక్, బొప్పిడి గోపాల్, సరితపంతూనాయక్, ప్రియా రమేశ్, మంజుల చంద్రమౌళి, నాయకులు శ్రీను నాయక్, పంతూనాయక్, సైదులు గౌడ్, రమేశ్‌గౌడ్, ప్రశాంత్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా
రైతులు సంఘటితం కావాలి


మాట్లాడుతున్న గజేందర్‌గౌడ్

షాబాద్, జూన్ 3 : రైతులందరూ పార్టీలకు అతీతంగా సంఘటితం కావాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. రైతులు పార్టీలకు అతీతంగా ఏకం కావాలన్నారు. మండలంలోని భారతీయ కిసాన్ సంఘ్ కమిటీలు 20 గ్రామాల్లో పనిచేస్తున్నాయన్నారు. వరి పంటను ప్రభుత్వం కొనుగోలు చేయని కారణంగా రైతులు తక్కువ ధరకు మిల్లర్లకు అమ్ముకొని నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు లు బీటీ విత్తనాలను సాగు చేయకూడదన్నారు. ఏఈవో సోనిశ్రీ, సంఘం జిల్లా కార్యవర్గసభ్యుడు సత్యనారాయణరెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు చంద్రబాబు, గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.



ఎంపీ అభ్యర్థి వంశీచంద్ పూజలు

కడ్తాల్, జూన్ 3: ఏఐసీసీ కార్యదర్శి, మహబూబ్ నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి సోమవారం కందుకూరు మండలం గుమ్మడవల్లి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం పార్లమెంట్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో స్వామివారిని దర్శించుకొని ఎంపీగా విజయం సాధించాలని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. అయనతో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, తదితరులు ఉన్నారు.

అటవీశాఖలో అక్రమాలు నిజమే!

విజిలెన్స్ డీఎఫ్‌వో రాజశేఖర్


మీడియాతో మాట్లాడుతున్న ఫారెస్ట్ విజిలెన్స్ డీఎఫ్‌వో రాజశేఖర్


వికారాబాద్ జిల్లా ఫారెస్ట్ కార్యాలయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వికారాబాద్, జూన్ 3 : బీడీలీఫ్ బోనస్‌లో అక్రమాలు జరిగిన మాట వాస్తవమేనని విజిలెన్స్ డీఎఫ్‌వో రాజశేఖర్ తెలిపారు. 'బోనస్ మింగేశారు' అని మే 29న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఈ క్రమంలో సోమవారం విజిలెన్స్ అధికారులు వికారాబాద్ జిల్లా ఫారెస్ట్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి విచారణ చేపట్టారు. ఇందుకు సంబంధించి అధికారులతో మాట్లాడడంతో పాటు కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిని కూడా ప్రశ్నించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ డీఎఫ్‌వో రాజశేఖర్ మీడియాతో మాట్లాడుతూ. వికారాబాద్ జిల్లా పరిధిలో మొత్తం 8 యూనిట్లు ఉన్నాయని వీటికి గాను మొత్తం బీడీలీఫ్ బోనస్ రూ. 53.72 లక్షలు మంజూరు కావడం జరిగిందన్నారు. గొట్టిముక్ల యూనిట్‌లో కేవలం ఇద్దరి ఖాతాల్లో 7.51 లక్షలు జమ చేయడాన్ని గుర్తించామని, ఇందుకు సంబంధించి ఆర్ఎఫ్‌వో అరుణ ఇట్టి డబ్బులు వేయడానికి సంతకం పెట్టడం జరిగిందన్నారు. కార్యాలయంలో పనిచేసిన డ్రైవర్‌తో పాటు అతని భార్య ఖాతాలో డబ్బులు పడ్డాయని తెలిపారు. ప్రస్తుతం డ్రైవర్ చనిపోయారని ఆయన భార్యకు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి ఎలా వచ్చాయనే వివరాలు ముందుగా తెలియవన్నారు. ప్రస్తుతం డ్రైవర్ భార్య ఇక్కడే పని చేస్తుందని ఆమె ఉద్యోగానికి ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. రేంజ్ ఆఫీసర్ సంతకం చేస్తే కంప్యూటర్ ఆపరేటర్ పేర్లు పంపడంతోనే డబ్బులు ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. 2017కు సంబంధించిన జిల్లాలోని 8 యూనిట్లకు రూ. 49.19 లక్షలు రాగా, 2018లో రూ. 1.63 లక్షలు వచ్చాయన్నారు. 2021లో నాలుగు యూనిట్లకు గాను 2.90 లక్షలు బోనస్ రూపంలో వచ్చాయన్నారు. ఒక రూపాయి ఖర్చుకు రెండున్నర రూపాయల ఆదాయం తునికాకుల వల్ల రావడంతోనే రైతులకు బోనస్ డబ్బులు పంపిణీ జరిగిందన్నారు. బీడీలీఫ్ అవినీతిపై జిల్లా వ్యాప్తంగా విచారణ చేపడుతామని, అదే విధంగా కోర్టు కేసులో ఉన్న సమయంలో క్రషర్ మిషన్‌లు ఓపెన్ చేయడం, టిప్పర్ లారీలు విడుదల చేయడం, పార్కింగ్ డబ్బుల్లో అవకతవకలు ఇక్కడికి వచ్చాక మీడియా ద్వారా తెలుసుకున్నామన్నారు. వాటిపై కూడా విచారణ చేపడుతామని పేర్కొన్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



చెరువు కట్టను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వసంత

ఆమనగల్లు, జూన్ 3: వర్షాకాలం ప్రారంభం నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ వసంత తెలిపారు. కాలనీలు, రోడ్ల పక్కన వర్షం నీరు నిల్వ ఉండకుండా, తాగునీటి సరఫరాకు ఆటంకం కలుగకుండా ముందస్తు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సోమవారం వసంత పర్యటించారు. మురుగు కాల్వలను, తాగునీటి పైపులైన్లను పరిశీలించారు. వర్షపు నీరు నివాస గృహాల మధ్య నిల్వ ఉండకుండా తగిన ఏర్పాట్లు చేయాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఉంటే తమ దృష్టికి తేవాలని స్థానికులకు సూచించారు. ఇరిగేషన్ శాఖ ఏఈ తిరుపతయ్యతో కలిసి స్థానిక సురసముద్రం చెరువు కట్టను పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో కట్టపై చెట్లను తొలగించాలని, తూముల వద్ద, అలుగు వద్ద నిర్వాహణ చేపట్టాలని సూచించారు. పట్టణంలోని ఆమనగల్లు-షాద్‌నగర్ రోడ్డు విస్తరణలో భాగంగా చేపడుతున్న వాన నీటికాలువ అసంపూర్తి పనులను ఆర్అండ్‌బీ ఏఈ రవితేజతో కలిసి పరిశీలించారు. అసంపూర్తి పనుల మూలంగా వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరుతుందని, కొందరు రోడ్డుపక్క నివాసముండేవారు నీరు పోకుండా అడ్డంగా నిర్మాణాలు చేపట్టారని ఆ ప్రాంత ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, ఇరిగేషన్ శాఖ ఏఈ తిరుపతయ్య, కౌన్సిలర్ విజయ్‌కృష్ణ, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ గోరటి నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ టీబీ టీకా


జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

రంగారెడ్డి అర్బన్, జూన్ 3 : అర్హులైన వారందరికీ టీబీ టీకా వేయనున్నట్లు జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా క్షయ నిర్మూలన కార్యక్రమం ఎన్‌టీఈపీ ఆధ్వర్యంలో స్థానిక కామినేని ఆసుపత్రిలోని ఇందిరా ఆడిటోరియంలో ఇందుకు సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని పీహెచ్‌సీ, బస్తీ, పల్లె దవాఖాన వైద్యులకు, సూపర్ వైజర్లకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ అరుణకుమారి స్వాగతోపన్యాసం చేశారు. డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ ఏపీ డామిల జిస్ట్ అడల్ట్ వ్యాక్సిన్‌కి సంబంధించి భవిష్యత్ కార్యాచరణపై వైద్యులకు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడారు. 2025 సంవత్సరం నాటికి మన దేశంలో క్షయ వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించాలనే లక్ష్యంలో భాగంగా 18 ఏళ్లపైబడిన వారందరికీ టీకా వేయాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిర్ణయించిందన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) ద్వారా ఈ టీకాల కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లాలో అమలు చేయనున్నట్లు చెప్పారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ అధ్యయన కార్యక్రమం (పైలెట్ ప్రాజెక్టు) కోసం మన రాష్ట్రంలో 17 జిల్లాలను ఎంపిక చేయగా, అందులో రంగారెడ్డి జిల్లా ఒకటి అని చెప్పారు. 18 ఏళ్లపైబడిన వారు, గత ఐదేళ్లలో క్షయ వ్యాధి బారిన పడినవారు, పొగ తాగేవారు, 60 ఏళ్లపైబడిన వారు, హెచ్‌ఐవీ, మధుమేహ వ్యాధి గ్రస్తులు, శారీరకంగా బలహీనంగా ఉన్న వ్యక్తులు అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ తీసుకునేందుకు అర్హులని చెప్పారు. ఇంటింటి సర్వే ద్వారా లబ్ధిదారులను గుర్తిస్తామని తెలిపారు. ఈ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల ఎలాంటి దుష్ఫలితాలు ఉండవని చెప్పారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు గీత, వినోద్, అనిత, హైల్త్ ఆఫీసర్ డాక్టర్ అంబిక, జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ ఏపీ డామిల జిస్ట్

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాల్‌రాజ్


మాట్లాడుతున్న బాల్‌రాజ్

చేవెళ్ల, జూన్ 3 : వాహనాదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాల్‌రాజ్ సూచించారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని, చట్టరీత్యా నేరమని ఆయన అన్నారు. అదేవిధంగా మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల సీఐ వెంకటేశం, ఎస్సై విఠల్‌రెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 55 కేసులు పరిష్కారం

చేవెళ్ల పట్టణ కేంద్రంలోని మున్సిఫ్ కోర్టు ఆవరణలో చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 55 కేసులు పరిష్కరించారు. ఇందుకుగాను రూ. లక్షా 41వేల 500 జరిమానా విధించినట్లు రిటైర్డ్ జడ్జి సాంబశివరావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోలీస్, కోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు పటిష్ట చర్యలు

● షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న



షాద్‌నగర్ అర్బన్, జూన్ 3: షాద్‌నగర్ మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ చీమ వెంకన్న తెలిపారు. ఆయన సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఇంటింటికీ మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తూనే.. మున్సిపల్ బోర్లను నడిపిస్తున్నామని చెప్పారు. అవసరమైన ప్రాంతాలకు మున్సిపల్ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీలోని ఏడవ వార్డులో కొంత సమస్య వచ్చిందని, దానిని అధిగమించడానికి మున్సిపల్ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఆ వార్డు కౌన్సిలర్ ఈశ్వర్ రాజు సైతం సొంత ట్యాంకర్‌తో స్వచ్ఛందంగా నీటిని సరఫరా చేస్తున్నారని అన్నారు. పట్టణ ప్రజలు తాగునీటి వృథాను అరికట్టి, పొదుపుగా వాడుకోవాలని వెంకన్న కోరారు.

నేడు వైన్‌షాపులు బంద్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 3: పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో పెట్టుకుని నేడు(మంగళవారం) ఉదయం 6 గంటల నుంచి కౌంటింగ్ పూర్తయ్యేవరకు మద్యంషాపులు బంద్ చేయనున్నట్లు షాద్‌నగర్ ఎక్సైజ్ సీఐ టి.శేఖర్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు షాద్‌నగర్ సర్కిల్ పరిధిలోని అన్ని మద్యం దుకాణాల యజమానులకు నోటీసులు ఇచ్చామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించాల్సిందేనని, ఎవరైనా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని శేఖర్ హెచ్చరించారు.

నిర్ణీత ధరలకే ఎరువులు విక్రయించాలి

● షాద్‌నగర్ ఏడీఏ రాజారత్నం

కొందుర్గు, జూన్ 3: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని వ్యవసాయ శాఖ షాద్‌నగర్ ఏడీఏ రాజారత్నం సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీనివాస ఆగ్రో ఏజెన్సీస్, మన గ్రోమోర్ సెంటర్‌ను ఏడీఏ తనిఖీ చేశారు. మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి శిరీష, సురేష్‌రెడ్డి, ఎస్సై కృష్ణయ్య, ఆర్ఐ శివకుమార్‌లతో కలిసి ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు లైసెన్స్ లేని దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయవద్దని, ఒకే కంపెనీ విత్తనాలు కావాలని, వాటి కోసం సమయం వృథా చేసుకోవద్దని, నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని, విత్తనాలు కొనే సమయంలో తప్పనిసరిగా బిల్లు(రశీదులు) తీసుకోవాలని, వాటిని పంటకాలం



ఆమనగల్లు : గోదాంలో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు



కొందుర్గు : ఎరువుల దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ రాజారత్నం

పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలని సూచించారు. విత్తనాలు, ఎరువుల స్టాక్ వివరాలను పరిశీలించారు. రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలను ప్రభుత్వ ధరలకే అమ్ముతున్నారా? అనే విషయం తెలుసుకునేందుకు ఏడీఏ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు, ఫోన్ చేసి వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకుగాను వ్యవసాయశాఖాధికారి, ఎస్సై, రెవెన్యూ శాఖ అధికారులతో బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఏడీఏ తెలిపారు.

విత్తనాలు, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించొద్దు

ఆమనగల్లు : విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తప్పవని ఆమనగల్లు మండల మల్టీ డిసిప్లినరీ టీం అధికారులు హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు విధిగా బిల్లులు ఇవ్వాలని డీలర్లకు ఆదేశించారు. ఆమనగల్లు మండలంలోని ఆకుతోటపల్లి గేటు, ముర్తోజుపల్లి గేటు, జంగారెడ్డిపల్లి గ్రామాలలోని అధీకృత ఎరువులు, విత్తన దుకాణాలను ఏవో అరుణకుమారి, ఎస్ఐ బాల్‌రామ్ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌లతో కూడిన బృందం తనిఖీ చేశారు. రికార్డులు, విత్తన, ఎరువుల నిల్వలు, గోదాంలను వారు పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. నకిలీ విత్తనాల నిరోధానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి విధిగా బిల్లులు(రశీదులు) తీసుకోవాలని అరుణకుమారి, బాల్‌రామ్‌నాయక్, వినోద్‌లు సూచించారు.

విత్తనాలు అందుబాటులో ఉంచాలి

తలకొండపల్లి : వానాకాలం పంటల సాగుకు అవసరమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజు డీలర్లు సూచించారు. అధీకృత డీలర్ల వద్ద రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని ఆయన కోరారు. మండల పరిధిలోని పడకల్ గ్రామంలోని ఓం శ్రీ సాయి ట్రేడర్స్, శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్, శివ ట్రేడర్స్ విత్తన దుకాణాలను సోమవారం ఏవో తనిఖీ చేశారు. రికార్డులను, ఎరువుల, విత్తనాల నిల్వలను పరిశీలించారు. కొనుగోలు చేసిన విత్తనాలకు రైతులకు విధిగా రశీదులు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. ఈ-పాస్ ద్వారానే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని తెలిపారు.

క్రైం కార్నర్

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



శ్రీశైలం

మాడ్గుల, జూన్ 3: మండలంలోని నాగిళ్ల గ్రామానికి చెందిన పాలకూర్ల శ్రీశైలం అదృశ్యమయ్యాడు. కాగా, ఎనిమిది సంవత్సరాల పాటు హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్ ప్రాంతంలో హోటల్‌లో వంట మాస్టర్‌గా అతడు పని చేశాడు. మూడేళ్ల క్రితం కరోనా సమయంలో గ్రామానికి వచ్చి ఇంటి వద్దనే ఉన్నాడు. అనంతరం ఆదిలాబాద్‌కు పని నిమిత్తం వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదని అతని అన్న నిరంజన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. అతడి ఆచూకీ తెలిసినచో 8712662365, 8712662385 నెంబర్లకు సమాచారమివ్వాలని చెప్పారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు పాత నేరస్థులు, విద్యార్థి అరెస్టు

● 5 తులాల బంగారు గొలుసు, 3 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం

కొత్తపేట, జూన్ 3 : చైన్‌స్నాచింగ్ కేసులో ముగ్గురు నిందితులను నాగోల్ పోలీసులు అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఇద్దరు పాత నేరస్థులు ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈనెల ఒకటో తేదీన మరిపల్లిలో ఓ వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెల గొలుసును తెంచుకుని బైకుపై పరారైన ఇద్దరు నిందితులను నాగోల్ పోలీసులు ఈనెల 2న గౌరెల్లి చౌరస్తాలో అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో మరో నిందితుడు వారికి సహకరించినట్లు తేలడంలో అతడినీ అరెస్టు చేశారు. 5 తులాల బంగారు పుస్తెల గొలుసు, 3 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. 2018లో ఆదిభట్ల పీఎస్ పరిధిలో మాదక ద్రవ్యాల కేసులో అరెస్టైన నల్లగొండకు చెందిన క్యాబ్ డ్రైవర్ మునగాల శివారెడ్డి(28), గతేడాది మీర్‌పేట పీఎస్ పరిధిలో మాదక ద్రవ్యాల కేసులో అరెస్టైన నల్లగొండ కనగల్ మండల్ బాబాసాహెబ్ గూడెంకు చెందిన సుంకిరెడ్డి శశిధర్‌రెడ్డి అలియాస్ శశిధర్(30), నల్లగొండ శ్రీనగర్ కాలనీకి చెందిన దేవులపల్లి సాయి కుమార్‌రెడ్డి(20) స్నేహితులు. సాయికుమార్‌రెడ్డి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వార్డుబాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ ముగ్గురూ ఎల్‌బీనగర్ పరిధి ఎన్టీఆర్ నగర్‌లో ఓ అద్దె గదిలో ఉంటున్నారు. ఈక్రమంలో వారు జల్సాలకు, చెడు అలవాట్లకు బానిసలై నేరాల బాటపట్టారు. దాంతో ఒకటో తేదీన మరిపల్లిలో శశిధర్‌రెడ్డి, సాయికుమార్‌రెడ్డి చైన్ స్నాచింగ్‌కు పాల్పడి పరారయ్యారు. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించి, నిందితులను పట్టుకున్నారు. నిందితులను సోమవారం రిమాండుకు తరలించారు.

ఆలయ నిర్మాణానికి భూరి విరాళం



విరాళం అందజేస్తున్న సత్తయ్య

యాచారం, జూన్ 3: మండలంలోని మొండిగౌరెల్లి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ నిర్మాణం కోసం డీసీసీబీ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య సోమవారం రూ.5లక్షల11వేల113 ఆలయ నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు దైవభక్తి అలవర్చుకోవాలన్నారు. ఆలయ నిర్మాణం కోసం తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆయన తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ నేడే

● లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠకు నేటితో తెర
● కౌంటింగ్ దగ్గర పడుతున్నకొద్దీ అభ్యర్థుల్లో టెన్షన్
● హోరాహోరీ పోరులో అంతుచిక్కని ఓటరు నాడి
● గెలుపుపై ఎవరి ధీమా వారిదే.. జోరుగా బెట్టింగులు



మల్లు రవి (కాంగ్రెస్)



భరత్‌ప్రసాద్ (బీజేపీ)



ప్రవీణ్ కుమార్ (బీఆర్ఎస్)

ఆమనగల్లు, జూన్ 3: లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై నెలకొన్న ఉత్కంఠకు నేడు తెరపడనుంది. ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం మరికొద్ది గంటల్లో తేలనుంది. కౌంటింగ్ దగ్గర పడుతున్న కొద్దీ గెలుపోటములపై అభ్యర్థులు, పార్టీల నేతల్లో క్షణక్షణం ఉత్కంఠ పెరిగిపోతుంది. హోరాహోరిగా సాగిన పోరులో ఫలితం ఎలా ఉంటుందోనని సర్వత్రా చర్చ మొదలైంది. అభ్యర్థులు ఇంకా విజయావాకాశాలపై బేరీజు వేసుకుంటున్నారు. అయితే, ఓటర్లు ఎవరిని ఆదరించారోనని పరిశీలకులకు సైతం అంతుచిక్కడం లేదరు. పోరును బట్టి ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఎవరు గెలిచినా సందేహం లేదన్న ప్రచారం సాగుతోంది. ఫలితాలపై మరో వైపు బెట్టింగులు కూడా జోరందుకున్నాయి. అభ్యర్థులు సైతం బయటకు ఎవరికి వారు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నా అంతర్గతంగా ఒకింత ఆందోళనకు లోనవుతున్నట్లు సమాచారం. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి 19 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, బీజేపీ పోతుగంటి భరత్ ప్రసాద్, బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ల మధ్యే రసవత్తర పోరు కొనసాగింది. కల్వకుర్తి, ఆమనగల్లు, వెల్దండ, చారగొండ, మాడ్గుల, కడ్తాల్, తలకొండపల్లి మండలాలతో కూడిన కల్వకుర్తి నియోజకవర్గంలోని 271 పోలింగ్ బూత్‌ల పరిధిలో 72.51 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ సారి వలస ఓటర్లు కూడా ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. ఇది ఎవరికి అనుకూలం, ప్రతికూలమనే అంశంపై చర్చకు తెరలేపింది. ఎక్కడ చూసిన పార్లమెంట్ ఫలితాలపైనే చర్చ కొనసాగుతోంది. అయితే, ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపారన్నది అంతుచిక్కడం లేదు.

కల్వకుర్తి నియోజకవర్గంలో ఓటర్లు

మొత్తం ఓట్లు	:	2,44,405
పోలైన ఓట్లు	:	1,77,224
స్త్రీలు	:	86,219
పురుషులు	:	91,004
పోలింగ్ శాతం	:	72.51
పోలింగ్ కేంద్రాలు	:	271

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాం. నాగర్‌కర్నూల్ ఏఎంసీ గోదాంలో మంగళవారం కౌంటింగ్ జరగనుంది. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుంది. మొత్తం 20 రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుంది. ఇప్పటికే కౌంటింగ్ ఏజెంట్ల నియామకం పూర్తైంది.

- శ్రీను, రిటర్నింగ్ అధికారి, కల్వకుర్తి

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : ఎంపీపీ



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ కృపేష్ తదితరులు

ఇబ్రహీంపట్నం, జూన్ 3: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ కృపేష్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి వెంకట ప్రతాప్‌రెడ్డిలు అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వారు అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షా కాలంలో గ్రామాల్లో ఎక్కడ కూడా మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని, మురుగునీటి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. తాగునీటి ట్యాంకులపై మూతలు ఉండేట్లు చూడాలన్నారు. కరోనాకు ముందు గ్రామాలకు సమయానుకూలంగా బస్సులు నడిపేవారని, ఆ తర్వాత బస్సులు తగ్గించి నడపడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీలు మంగ, శ్రీశైలం, ఆంజనేయులు సభ దృష్టికి తెచ్చారు. పోల్కంపల్లి నుంచి అనాజ్‌పూర్ మీదుగా హైదరాబాద్‌కు బస్సును పునరుద్ధరించాలని అన్నారు. యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని ఎక్సైజ్ సీఐ సీతారాంరెడ్డి సలహా చేశారు. ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందని, రైతుల సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన అధికారి కనకలక్ష్మీ సూచించారు. వర్షాలు కురువగానే నాటేందుకు నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయని, అందుకు గ్రామాల్లో తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని ఉపాధి హామీ పథకం ఏపీవో తిరుపతాచారి కోరారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో క్రాంతికుమార్, మండల వ్యవసాయాధికారి వరప్రసాద్‌రెడ్డి, ఎంఈవో వెంకట్‌రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటనర్సప్ప, సీడీపీవో శాంతిశ్రీ, సెర్ప్ ఏపీఎం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఫత్తేపురం ఫ్లైఓవర్

● వర్షానికి దెబ్బతిన్న రోడ్డు
● ఇబ్బందుల్లో వాహనాదారులు, ప్రజలు

శంకర్‌పల్లి, జూన్ 3: శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఫత్తేపురం ఫ్లైఓవర్ వద్ద రోడ్డు పూర్తిగా పాడైంది. వర్షం పడటంతో నిరంతా నిలిచి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడటంతో ప్రయాణం నరకంగా మారింది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి గోతుల్లో నీరు నిలవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. ఈదారి వెంట ప్రయాణించాలంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. గతంలో పలువురు ప్రమాదాల బారినపడిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు మొద్దు నిద్ర వీడటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు భవనాల శాఖ అధికారులు పాడైన రోడ్డును బాగు చేయించి కష్టాలు తీర్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



నిలిచిన వర్షపు నీటితో ఫత్తేపురం ఫ్లైఓవర్‌పై రోడ్డు దుస్థితి, తేలిన కంకర

స్నేహసంబంధాలకు వారధి క్రీడలు



బహుమతులు అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి

ఆదిభట్ల, జూన్ 3: క్రీడా పోటీలు వ్యక్తుల మధ్య స్నేహ సంబంధాలు మెరుగుపడేందుకు వారధిగా నిలుస్తాయని ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లోని క్రికెట్ గ్రౌండ్‌లో మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పత్రికా విలేకర్లు కలిసి నిర్వహించిన వన్‌డే ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌ను మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణతో కలిసి నిరంజన్ ప్రారంభించి ప్రజాప్రతినిధుల జట్టుతో మ్యాచ్‌లో పాల్గొన్నారు. సాయంత్రం క్రికెట్ మ్యాచ్‌లో గెలుపొందిన విన్నర్ టీం మున్సిపల్ సిబ్బంది, విలేకరుల జట్టు రన్నర్ టీంలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధృడత్వం కలిగి మానసిక ఆరోగ్య స్థితి మెరుగు పడుతుందన్నారు. క్రీడాపోటీలు నిర్వహించడం వల్ల వ్యక్తుల మధ్య స్నేహ సంబంధాలు మెరుగుపడుతాయన్నారు. గెలుపోటములను క్రీడా స్ఫూర్తితో తీసుకొని ముందుకు సాగాలని, అప్పుడే జీవితంలో ఏదైనా సాధించవచ్చన్నారు. క్రికెట్ మ్యాచ్‌లో మున్సిపల్ సిబ్బంది జట్టు విజయం సాధించగా తెలంగాణ సాధనలో అసువులు బాసిన యువకులకు అంకితం చేస్తున్నట్లు నిరంజన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో పాల్గొన్న ప్రతీ వ్యక్తి తనదైన పాత్ర పోషించారన్నారు. నాడు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వ్యక్తులను అమరవీరులైన కొంగరకలాన్‌కు చెందిన కాకి కుమార్, మహేశ్వరం మండలంకు చెందిన యాదయ్యలను గుర్తుచేసుకుంటూ వారి త్యాగాలు వెలకట్టలేనివని భావోద్వేగానికి లోనయ్యారు. మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు పొట్టి రాములు, వనం శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు గోపాల్ గౌడ్, సీనియర్ పాత్రికేయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణ సముదాయ నిర్మాణానికి కృషి

● పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి




వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆమనగల్లు, జూన్ 3: ఆమనగల్లు పట్టణంలో దుకాణ సముదాయాలు నిర్మించి చిరువ్యాపారులను ఆదుకుంటామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా దుకాణ సముదాయం నిర్మించేలా కృషి చేస్తానని అన్నారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం మల్లు పర్యటించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్యల ఆధ్వర్యంలో చిరు వ్యాపారులు మల్లు రవిని కలిసి ఆమనగల్లు పట్టణంలో దుకాణ సముదాయ నిర్మాణానికి ప్రభుత్వపరంగా సహకరించాలని వినతిపత్రం అందజేశారు. ఆమనగల్లు పట్టణంలో శ్రీశైలం-హైదరాబాద్, ఆమనగల్లు-షాద్‌నగర్ ప్రధాన రహదారుల విస్తరణతో దుకాణాలు, డబ్బాలు, కొట్లు తొలగించడం మూలంగా వందల మంది చిరు వ్యాపారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని వినతి పత్రంలో పేర్కొన్నారు. దశాబ్ద కాలంగా దుకాణ సముదాయ నిర్మాణానికి పోరాటం చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించారు. కులవృత్తుల, చిరు వ్యాపారుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజాపాలన ధ్యేయమన్నారు. ప్రజా పాలనలో అన్నివర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఖలీల్, కాంగ్రెస్ నాయకులు ఖాదర్, పురుషోత్తం, శివలింగం, మల్లేశ్, కుమార్ గౌడ్, గణేశ్, ఈదమయ్య, పర్వతాలు, మైసయ్య, కృష్ణయ్య, చిరువ్యాపారుల సంఘం నాయకులు నరేందర్, సుధాకర్, వెంకటేశ్, దుర్గమ్మ, సావిత్రమ్మ, పార్వతమ్మ, అమృతమ్మ, తదితరులు ఉన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

మొయినాబాద్ రూరల్, జూన్ 3: కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదాపడింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి పనులపై కోడ్ ముగిసిన తరువాత వారం రోజుల్లో సమావేశం ఏర్పాటు చేసి చర్చిద్దామని మొయినాబాద్ ఎంపీపీ నక్షత్రం జయవంత్ చెప్పారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశారు. ఈ నెల 3న సర్వసభ్య సమావేశం నిర్వహించాలని వారం రోజులుగా అధికారులు కసరత్తు చేసి ఎజెండాను తయారు చేశారు. అన్ని శాఖల అధికారులకు సర్క్యులర్ జారీ చేశారు. కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు సైతం పాల్గొన్నారు. కానీ, సమావేశాన్ని నడిపించడానికి ఎంపీటీసీ సభ్యులు ఎవరూ హాజరు కాలేదు. ఎంపీపీతో కలిపి 17 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా.. ఎంపీపీ నక్షత్రం, వైస్ ఎంపీపీ మమత కృష్ణాయాదవ్, రెడ్డిపల్లి, శ్రీరాంనగర్ ఎంపీటీసీ సభ్యులు మోర శ్రీనివాస్, రాంరెడ్డిలు మాత్రమే పాల్గొన్నారు. మిగతా సభ్యుల రాక కోసం మధ్యాహ్నం 12 గంటల వరకు ఎంపీపీ, అధికారులు వేచి ఉన్నారు. తర్వాత సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ప్రకటించారు. వారం రోజుల్లో సమావేశాన్ని ఏర్పాటు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులపై తీర్మానాలు చేసి చర్చిద్దామని ఎంపీపీ తెలిపారు. ఎంపీడీవో సంధ్య, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఏవో రాఘమ్మ, హెచ్‌వో అశోక్, సూపరింటెండెంట్ సులోచన, ఏఈలు హము, రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ నక్షత్రం జయవంత్

మృతుడి కుటుంబానికి పరామర్శ

కడ్తాల్, జూన్ 3: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన డిల్లీ శ్రీను ముదిరాజ్ అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం భౌతిక కాయాన్ని ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని కుటుంబానికి మనోధైర్యం కల్పించి రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తగిన సాయమందేలా చూస్తానని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు కేశని బుచ్చయ్య, పిప్పళ్ల యాదయ్య, క్యామ శేఖర్, మీగడి జంగయ్య, చెన్నమోని కృష్ణ, బాలయ్య, క్యామ రాజేశ్, బోళ్ల శ్రీను, బోసు రవి, శ్రీకాంత్, మహేశ్, సురేశ్, బానుకిరణ్, నరేశ్, శ్రీశైలం, మణికిరణ్ తదితరులు ఉన్నారు. అలాగే కడ్తాల మండలంలో వివిధ ప్రమాదాలు, అనారోగ్యంతో మృతిచెందిన బాధిత కుటుంబాలకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేయూతనందిస్తానని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం దశరథ్ నాయక్ పర్యటించారు. పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. కడ్తాల బీసీ కాలనీలో అనారోగ్యంతో మృతి చెందిన శ్రీను కుటుంబాన్ని పరామర్శించారు. ట్రస్ట్ ద్వారా రూ.5వేలు, మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ రూ2వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. వారిలో యువజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్, లాయక్‌అలీ, మహేశ్, వెంకటయ్య, యాదయ్యలు ఉన్నారు.





నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, ఆర్థికసాయం అందజేస్తున్న దశరథ్

బస్సు సౌకర్యం ఏర్పాటుకు వినతి

కడ్తాల్, జూన్ 3: ఆమనగల్లు నుంచి మాల్‌కు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాలని ముద్విన్ గ్రామ నాయకులు ఆర్టీసీ అధికారులను కోరారు. సోమవారం మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బస్సు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ఆమనగల్లు నుంచి ఆకుతోటపల్లి, గౌరారం, శెట్టిపల్లి, ముద్విన్, చరికొండ, మేడిపల్లి మీదుగా మాల్ వరకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన మేనేజర్ త్వరలోనే ఆర్టీసీ బస్సు ఏర్పాటుకు హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఈర్లపల్లి వెంకటయ్య, గురిగళ్ల మహేశ్, నక్కపోతు యాదయ్య, పొగాకు వినోద్ తదితరులు ఉన్నారు.



పూజలు నిర్వహిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

సేవలతోనే సమాజంలో కీర్తి

కడ్తాల్, జూన్ 3: సేవలతోనే సమాజంలో కీర్తి లభిస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. పరుల మేలును కాంక్షించి సన్మార్గంతో ముందుకు సాగేవారు జీవితంలో అద్భుతంగా రాణిస్తారని అన్నారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని సోమవారం సుంకిరెడ్డి సందర్శించారు. మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమెరికా పర్యటన ముగించుకొని స్వదేశానికి వచ్చిన సుంకిరెడ్డికి మైసమ్మ దేవాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఆమనగల్లు కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మండ్లీ రాములు, రాంనుంతల మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, ఫౌండేషన్ సభ్యులు తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి, జూన్ 3: వెల్జాలకు చెందిన కేబుల్ స్పైసర్ మన్యంకు కేబుల్ ఆపరేటర్ల సంఘం నాయకులు చేయూతనందించారు. వెల్జాల గ్రామ సమీపంలో కేబుల్ వైర్ సరిచేస్తుండగా బాలనగర్ మండలం చిన్నరేవల్లి గ్రామానికి చెందిన మన్యం విద్యుత్ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి చికిత్స పొందాడు. సోమవారం మన్యంకు సంఘం తరఫున రూ.26వేలు ఆంజనేయులు, చంద్రకుమార్, రాజశేఖర్, సాయిబాబా, తిరుపతయ్య గౌడ్, లక్ష్మీనారాయణ, రహీమ్, రవి, శ్రీను, శ్రవణ్‌కుమార్, తిరుపతయ్య, తదితరులు అందజేశారు.

హనుమాన్ ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఆమనగల్లు, జూన్ 3: మాడ్గుల మండలం నల్లవారిపల్లి గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులు సోమవారం ప్రారంభించారు. గ్రామస్థుల సహకారంతో దేవాలయాన్ని పునరుద్ధరిస్తున్నారు. పాత ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో మరికొంత స్థలాన్ని సేకరించి నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాతలు, స్థానిక నేతలు, గ్రామస్థులతో కలిసి అర్చకులు సీతరామ శర్మ, కె. నయనాచారిలు భూమిపూజ చేశారు. దేవాలయ నిర్మాణానికి ముందుకు వచ్చిన దాతలను అభినందించారు. అంతకుముందు ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించారు. స్థానిక నాయకులు, దాతలు తేలుకుంట్ల అశోకవర్ధన్ రెడ్డి, ఇటికాల హన్మంత్ రెడ్డి, ఇటికాల జయమ్మరవీందర్ రెడ్డి, గజ్జె కృష్ణయ్య, ఇటికాల నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.